క్లుప్తంగా

అంగన్‌వాడీ ఆయాపోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నకరికల్లు: మండలంలోని గుండ్లపల్లి, చీమల మర్రి గ్రామాల్లో అంగన్‌వాడీ ఆయాపోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సూపర్‌వైజర్‌లు షేక్.రమీజున్, ఆనందకుమారిలు ఆదివారం తెలిపారు. గుండ్లపల్లిలో ఓసీ జనరల్, చీమలమర్రిలో ఓసీ కేటగిరీలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 21 నుంచి 35ఏళ్లలోపు వయస్సు కలిగి 7వ తరగతి పూర్తై స్థానికులై ఉండాలన్నారు. దరఖాస్తులను ఈ నెల 31వ తేదీలోగా అందజేయాలని సూచించారు.

రైలు కింద పడి వ్యక్తి మృతి

సత్తెనపల్లి: రైలు ఎక్కుతూ ప్రమాదవశాత్తు జారి పడి వ్యక్తి మృతి చెందిన ఘటన పల్నాడు జిల్లా సత్తెనపల్లి రైల్వేస్టేషన్‌లో ఆదివారం జరిగింది. మేడికొండూరు మండలం సిరిపురం గ్రామానికి చెందిన శివ ప్రసాద్ హైదరాబాద్ వెళ్లేందుకు సత్తెనపల్లి రైల్వేస్టేషన్‌లో ఆదివారం ఉదయం రైలు ఎక్కుతుండగా కాలుజారి రైలు కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో శివప్రసాద్ అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వే పోలీసులు ఘటనా స్థలాన్ని సందర్శించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అభిషేకానికి వెండి బిందె బహూకరణ



నకరికల్లు: మండలంలోని నర్సింగపాడులో గల శ్రీ అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వరస్వామి వారికి అభిషేకం చేసేందుకు కారంపూడికి చెందిన ఆత్మకూరి రామారావు, వెంకటలక్ష్మీ దంపతులు ఆదివారం వెండి బిందెను బహూకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు కొమ్మవరపు పవన్‌కుమార్ శర్మకు వెండి బిందెను అందజేశారు. అనంతరం అమ్మవారికి, స్వామివారికి విశేష పూజలు చేశారు. ఆలయంలో గో పోషణ నిమిత్తం ఆత్మకూరి అవినాష్, తుషారలక్ష్మి దంపతులు రూ.5,116లు సమర్పించారు.

విద్యుదాఘాతంతో ఐదు గేదెలు మృతి

రాజుపాలెం: విద్యుత్‌తీగలు తగిలి ఐదు పాడి గేదెలు మృత్యువాతపడ్డాయి. ఈ ఘటన మండలంలోని బలిజేపల్లి వద్ద ఆదివారం జరిగింది. ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. బలిజేపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ జొన్నలగడ్డ ప్రసాద్ తన పాడిగేదెలను మేతకోసం పొలానికి తోలుకొని వెళ్లాడు. బలిజేపల్లి-గణపవరం వద్ద గేదెలు మేతమేస్తుండగా విద్యుత్ హైటెన్షన్ తీగలు తెగిపడ్డాయి. దీంతో తీవ్ర విద్యుత్‌షాక్‌కు గురైన ఐదు పాడిగేదెలు అక్కడికక్కడే మృతిచెందాయి. సుమారు రూ.2.50లక్షలు నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోతున్నాడు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని విన్నవిస్తున్నాడు.

హైవేపై రెండు కార్లు ఢీ..

ప్రయాణికులు సురక్షితం



యడ్లపాడు: రోడ్డు ప్రమాదంలో రెండు కార్లు పాక్షికంగా దెబ్బతినగా అందులోని ప్రయాణిస్తున్న వారికి ప్రమాదం తప్పింది. పోలీసులు తెలిపిన వివరాలు.. బాపట్ల జిల్లా బల్లికురవ మండలం కొత్తమల్లాయపాలెం గ్రామానికి చెందిన జూపల్లి రుద్రరాజు గుంటూరు నుంచి స్వగ్రామానికి కారులో వెళ్తుండగా.. తిమ్మాపురం తిరుమల కాటన్ మిల్లు సమీపంలో హైవేపై రహదారి పనులు చేస్తుండటం గమనించి ఒక్కసారిగా రైట్‌సైడ్‌కు వాహనాన్ని మళ్లించాడు. అదే మార్గాన కాకినాడ నుంచి చెన్నైకు వెళ్తున్న కారుకు అడ్డురావడంతో షడన్‌బ్రేక్ వేసినా వేగంలో అదుపకాక అడ్డుగా వచ్చిన కారును ఢీకొంది. దీంతో రెండు కార్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. అయితే కాకినాడ జిల్లా కిర్లంపాడు మండలం ముక్కొల్లు గ్రామానికి చెందిన కర్రీ సాయిరామ్ కారులో నలుగురు ఉన్నారు. ఊహించని విధంగా జరిగిన ఈ ప్రమాదంలో రెండు కార్లలోని ఐదుగురికి స్వల్పగాయాలు కూడా కాకపోవడంతో కార్లలోని వారితో పాటు రహదారి పనులు చేస్తున్న కార్మికులు సైతం ఊపిరి పీల్చుకున్నారు. ఘటనా స్థలానికి చేరుకున్న హైవే పోలీసులు కార్లను పక్కకు తీయించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేశారు.

పాహిమాం.. సర్వేశ్వరీ


పట్టణంలో దుర్గాదేవిగా వాసవీ మాత


త్రిశక్తి దుర్గాపీఠంలో దుర్గాదేవి అలంకారం


మహిషాసురమర్థినిదేవి అలంకారంలో


నర్సింగపాడులో దుర్గాదేవి అలంకరణలో


క్రోసూరులో వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారు


శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు


శ్రీదుర్గాదేవి అలంకారంలో అంకమ్మతల్లి అమ్మవారు

దుర్గాదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు

సత్తెనపల్లి: దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు నియోజకవర్గంలో కనుల పండువగా జరుగుతున్నాయి. పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం, త్రిశక్తి దుర్గాపీఠం, సనారీ వీరబ్రహ్మేంద్ర ఆశ్రమం, వెంకటపతి కాలనీలోని శ్రీ నీలంపాటి శ్రీ లక్ష్మీ అమ్మవారి పీఠంలో అమ్మవారిని ఆదివారం దుర్గాదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొత్తపేట మహాలక్ష్మమ్మ చెట్టు వద్ద అమ్మవారిని కాళికాదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. త్రిశక్తి దుర్గా పీఠంలో నాగవల్లి దళాలతో అమ్మవారిని అలంకరించారు. సత్తెనపల్లి మండలం పెద్దమక్కెన గ్రామంలోని గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవాలయంలో అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారి కృపకు పాత్రులయ్యారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఆయా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఘనంగా శరన్నవరాత్రి వేడుకలు

నకరికల్లు: మండలంలో పలుగ్రామాల్లోని ప్రముఖ ఆలయాల్లో దేవీ నవరాత్రుల ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం అమ్మవారు విశేషమైన అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శిబి చక్రవర్తి కాలంనాటి శ్రీకపోతేశ్వరస్వామి ఆలయంలో శ్రీ మహిషాసుర మర్ధిని దేవి అలంకారంలోను, నర్సింగపాడులోని మరకతలింగ చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో శ్రీదుర్గాదేవి అలంకారంలో, శ్రీ అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీ దుర్గాదేవి అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. విశేష అలంకరణలో అమ్మవారిని దర్శించుకున్న భక్తులు మొక్కులు చెల్లించారు.

దుర్గాదేవిగా కన్యకాపరమేశ్వరి అమ్మవారు

అచ్చంపేట: స్థానిక శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో వాసవీమాత దుర్గాదేవిగా ఆదివారం భక్తులకు దర్శనమిచ్చారు. నిర్వాహకులు సూరే సుబ్బారావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమాలు చేపట్టారు. ఆర్యవైశ్య మహిళా విభాగం వారిచే లలిత, కన్యకాపరమేశ్వరి అమ్మవారి సహస్ర, అష్టోత్తర శతనామ పారాయణం జరిగింది. శ్రీ సీతారామస్వామివారి దేవాలయంలో అమ్మవారు భక్తులకు వరలక్ష్మీగా దర్శన భాగ్యం కలిగించారు. ప్రతి దేవాలయంలోనూ మహిళలు బతుకమ్మలు నిర్వహిస్తున్నారు. పలు గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

దుర్గాదేవీగా వాసవీ కన్యకా పరమేశ్వరీ

క్రోసూరు: దసరా శరన్నవరాత్రులు పురస్కరించుకుని క్రోసూరు వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారు దుర్గాదేవీగా భక్తులకు ఆదివారం దర్శనమిచ్చింది. అమ్మవారు దుష్టశిక్షణ కొరకు దుర్గాదేవీ అవతారంలో తన భక్తులకు రక్షణ కల్పించినట్లు పూజారి తెలియచేసారు. ఆర్యవైశ్య మహిళలు అమ్మవారి భజనలు, కీర్తనలు నిర్వహించారు. సాయంత్రం బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారి నవరాత్రి మహోత్సవాలను ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు.

దుర్గాదేవిగా దర్శనమిచ్చిన అంకమ్మతల్లి

రాజుపాలెం: స్థానిక అంకమ్మతల్లి అమ్మవారు శ్రీ దుర్గాదేవి అలంకారంలో భక్తులకు ఆదివారం దర్శనమిచ్చారు. దసరా శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. సమీప గ్రామాల నుంచి వచ్చిన భక్తులు విశేష అలంకరణలో ఉన్న అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు.

దుర్గాదేవి అలంకారంలో అమ్మవారు

ముప్పాళ్ళ: మండలంలోని పలు గ్రామాల్లో దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా అమ్మవారు శ్రీ దుర్గాదేవి అలంకారంలో ఆదివారం భక్తులకు దర్శనమిచ్చారు. లంకెలకూరపాడులోని శ్రీగంగా పార్వతి సమేత ఓంకారేశ్వరస్వామి ఆలయంలోను, చాగంటివారిపాలెంలో ఏర్పాటు చేసిన మండపంలోను, నార్నెపాడులోని శ్రీ శంభులింగేశ్వరస్వామి ఆలయం, కుందురువారిపాలెంలోని శ్రీ సాందీపని ఆశ్రమంలోను, ముప్పాళ్ళలోని శ్రీ అన్నపూర్ణ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలోను అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

బెల్లంకొండలో మహిషాసురమర్ధినిగా అమ్మవారు

బెల్లంకొండ: దసరా శరన్నవరాత్రుల మహోత్సవాలలో భాగంగా మండలంలోని బెల్లంకొండ శ్రీ మహాలక్ష్మీ పీఠంలో ఆదివారం అమ్మవారు మహిషాసురమర్ధిని అలంకార రూపంలో దర్శనమిచ్చారు. మహిషాసురమర్ధిని అమ్మవారు సిద్ధి ధాత్రిగా పిలువబడుతుందని వేద పండితులు పులుపుల వేంకట ఫణి కుమార శర్మ తెలిపారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పూజారులు అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు, సాయంత్రం భజనలు నిర్వహించారు. సోమవారం అమ్మవారు రాజరాజేశ్వరిగా దర్శనంతో ఉద్వాసన పలకనున్నట్లు పేర్కొన్నారు. అదే విధంగా అపరాజితా దేవి పూజ, శమీ పూజలు చేయనున్నట్లు తెలిపారు.


బెల్లంకొండలో మహిషాసురమర్ధిని అలంకార రూపంలో అమ్మవారు

‘ఏపీకి జగనే ఎందుకు కావాలి’.. అద్భుతంగా జరగాలి

- ప్రజల వద్దకు వెళ్లి ఓటు అడిగే హక్కు..వైఎస్సార్ సీపీకి మాత్రమే ఉంది
- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- సామాజిక న్యాయ బస్సు యాత్ర. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాల నిర్వహణపై సన్నాహక సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: నవంబర్ ఒకటి నుంచి ప్రారంభం కానున్న ‘వై ఏపీ నీడ్స్ జగన్’ ఈనెల 26న ప్రారంభం కానున్న ‘సామాజిక న్యాయ బస్సు యాత్ర’ కార్యక్రమాలు అద్భుతంగా జరగాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో ఆదివారం రాత్రి సామాజిక న్యాయ బస్సుయాత్ర, వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాల నిర్వహణపై నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సమావేశానికి వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ మౌలాలి అధ్యక్షత వహించారు. మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ నియోజవర్గంలో గత నాలుగేళ్లుగా అధికారంలోకి వచ్చిన తర్వాత ఎప్పుడూ, ఎక్కడా, ఎన్నడూ అక్రమాలు చేయలేదని, అన్యాయంగా ప్రవర్తించలేదన్నారు. రౌడీయిజాన్ని ప్రోత్సహించలేదని, మన పార్టీ వాళ్లయినా తప్పు చేస్తే హెచ్చరించానని, కుల,మత,వర్గ విభేదాలు లేకుండా ఒక నిబద్ధ తతో పరిపాలన చేస్తున్నానని... అందుకే ప్రజల వద్దకు వెళ్లి ఓటు అడిగే హక్కు ఒక్క వైఎస్సార్ సీపీకి మాత్రమే ఉందన్నారు. పవన్ కల్యాణ్‌తో నాకు వ్యక్తిగతంగా ఎలాంటి విభేదాలు లేవని చిరంజీవి, పవన్‌లు, మా ఇంటికి పెళ్లికి వచ్చారని అయితే వైఎస్సార్ సీపీకి కమిట్మెంట్‌గా పని చేస్తానన్నారు. ప్రతిపక్ష నేతలను ఎన్నడూ బూతులు తిట్టలేదని, కించపరిచే విధంగా మాట్లాడనని సంస్కారవంతంగా మాత్రమే విమర్శిస్తానన్నారు. పార్టీ, ప్రభుత్వంకు సంబంధించిన ప్రతి కార్యక్రమం నియోజకవర్గంలో చిత్తశుద్ధితో విజయవంతం అయ్యేలా నిర్వహిస్తున్నామన్నారు. అలాగే ఈనెల 26వ తేదీన ప్రారంభం కానున్న సామాజిక న్యాయ బస్సు యాత్ర, నవంబర్ ఒకటో తేదీ నుంచి నియోజకవర్గంలో ప్రారంభమయ్యే వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాల నిర్వహణపై ఆయన విధి, విధానాలను వివరించారు. నిర్ణయించిన తేదీల ప్రకారం సచివాలయాల వారీగా పార్టీ అధ్యక్షుల ఆధ్వర్యంలో అధికారులతో కలిసి సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరణ, అనంతరం పార్టీ ఆధ్వర్యంలో ముఖ్య నేతలతో సమావేశాలు, మరుసటి రోజు ఉదయం సచివాలయ పరిధిలో పార్టీ జెండా ఆవిష్కరణ, ఇంటింటికి సంక్షేమ చైతన్య కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. క్షేత్రస్థాయి నుంచి నియోజవర్గ స్థాయి నాయకుల వరకు అందరూ సంసిద్ధంగా ఉండాలని కోరారు. మాజీ శాసనసభ్యుడు యర్రం వెంకటేశ్వర రెడ్డి, పార్టీ నియోజకవర్గ నాయకుడు పక్కాల సూరిబాబు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివ రావు, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ నాగూర్ మీరాన్, ఏఎంసీ చైర్మన్ పెండెం బాబు రావు, పల్నాడు జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, డాక్టర్ మక్కెన అచ్చయ్య, జేసీఎస్ పట్టణ ఇన్‌చార్జ్ కొణతం స్వాతి, పలువురు కౌన్సిలర్లు, ముఖ్య నాయకులు, సచివాలయాల కన్వీనర్లు, సోషల్ మీడియా కన్వీనర్లు పాల్గొన్నారు.

యువత సన్మార్గంలో పయనించాలి



దాచేపల్లి : యువత సన్మార్గంలో పయనించాలని పాస్టర్ జీఎస్ ప్రసన్నకుమార్ అన్నారు. మండలంలోని కేసానుపల్లి క్రీస్తు లూథరన్ దేవాలయంలో యువజనుల ఆదివారం సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గీతాలు ఆలపించి వాక్య సందేశం అందించారు. పాస్టర్ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ యవ్వనంలో యువత చెడుమార్గంలో పయనించవద్దని, జీవితంలో స్థిరపడేందుకు ఆ దశ ఎంతో ముఖ్యమైందన్నారు. మహానీయులను ఆదర్శంగా తీసుకుని యువతీ, యువకులు జీవితంలో స్థిరపడాలని, క్రీస్తు బోధనలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఎల్‌సీ డేలిగేట్ వినుకొండ బాబు, చర్చి డేలిగేట్ శ్రీపతి కాశయ్య, సర్పంచ్ వినుకొండ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి సమాజానికి యువతే అధారం

అమరావతి: నేటి సమాజానికి, దేశ భవిష్యత్తుకు యువతే ఆధారమని ఏపీ ప్రభుత్వ క్రైస్తవ వ్యవహారాల మైనారిటీ సంక్షేమ సలహాదారుడు రెవరెండ్ ఫాదర్ డాక్టర్ ఎం బాలస్వామి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని ధరణికోట జైల్‌సింగ్‌కాలనీ లూథరన్ చర్చిలో ఆదివారం నిర్వహించిన యూత్‌ఫెస్టివల్‌లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి చర్చి పాస్టర్ సత్యానందకుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఫాదర్ బాలస్వామి మాట్లాడుతూ విద్యార్థులు వ్యసనాల జోలికి పోకుండా దైవచింతన, చదువుపట్ల అంకిత భావం, దేశభక్తి, పట్టుదల, నిరంతర కృషి వంటి లక్షణాలు కలిగి ఉండాలన్నారు. ఈ సందర్భంగా ఫాదర్ బాలస్వామిని యూత్‌ఫెస్టివల్ నిర్వాహకులు సన్మానించారు. యూత్‌ఫెస్టివల్ సభ్యులు లూకా, సుధాకర్, గోపి డార్సీ, విన్సీ వంశీ, పవన్, కళ్యాణ్‌లతో పాటు ధరణికోట లూథరన్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.


ఫాదర్ బాలస్వామిని సన్మానిస్తున్న యూత్‌ఫెస్టివల్ నిర్వాహకులు

అ‘పూర్వ’ కలయిక

పెదకూరపాడు: వృద్ధ వయస్సులో బాల్య స్నేహితులు కలిసి పూర్వ జ్ఞాపకాలతో రోజంతా గడిపారు. చిన్ననాటి మధురస్మృతులు స్మరించుకుంటూ ఒకసారి చిన్న పిల్లలుగా మారి ఆనందంగా గడిపారు. గుర్తుపట్టలేని విధంగా ఉన్న బాల్య స్నేహితులను పలకరించుకుంటూ సందడిగా గడిపారు. 1973 పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం పెదకూరపాడులోని జెడ్పీ పాఠశాలలో జరిగింది. పూర్వ విద్యార్థి నాయకులు పఠాన్ వజీర్‌ఖాన్ నేతృత్వంలో ఒకే వేదికపై 50 ఏళ్ల తరువాత కలిశారు. ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి నెట్టెం రఘురాం, ప్రముఖ వైద్యులు ప్రొఫెసర్ కొమరాబత్తిన రత్తయ్య హాజరయ్యారు. విద్యా బుద్ధులు నేర్పిన గురువులను స్మరించుకున్నారు.పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల సంఘం విరాళం ప్రకటించింది. ముఖ్య అతిథి నెట్టెం రఘురాం మాట్లాడుతూ 50 ఏళ్ల తరువాత సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన స్నేహితులను చూసి సంతోషంగా ఉందన్నారు. పాఠశాలకు గౌరవం గుర్తింపు తెచ్చేలా పూర్వ విద్యార్థులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో 60 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

పోరాటయోధుడు కుమురం భీమ్

చిలకలూరిపేట: గిరిజన హక్కుల సాధన కోసం అలుపెరుగని పోరాటం చేసిన గొప్ప యోధుడు కుమురం భీమ్ అని ఏపీ గిరిజన సంఘాల ఐక్య వేదిక అధ్యక్షుడు బి.శ్రీనునాయక్ చెప్పారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఉన్న ఏలూరి సిద్దయ్య విజ్ఞాన కేంద్రంలో భీమ్ జయంతిని ఆదివారం నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ జల్, జంగల్, జమీన్ అంటూ ఆదివాసుల హక్కుల కోసం నినదించారని పేర్కొన్నారు. అడవి బిడ్డల ఆత్మగౌరవం కోసం నిజాం సైన్యంతో పోరాటం చేశారని తెలిపారు. గిరిజనులకు జరుగుతున్న అన్యాయాలను చూసి భీమ్ 16 ఏళ్ల వయసు నుంచే పోరాటం చేశారని వెల్లడించారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం

పెదకూరపాడు: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మండలంలోని లగడపాడు గ్రామంలో పూరిల్లు దగ్ధమైన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ఏకుల నరసింహారావు దంపతులు కౌలు రైతులు. ఆదివారం ఇంటికి తాళం వేసి వ్యవసాయ పనులకు వెళ్లారు. మధ్యాహ్నం విద్యుత్ షార్క్ సర్క్యూట్ కావడంతో పూరిల్లు పూర్తిగా దగ్ధమైంది. ఇంటిలో ఉన్న గ్యాస్ సిలిండర్ కూడా పేలిపోవడంతో మంటలు ఎగసిపడ్డాయి. ఇంటిలో ఉన్న సామాగ్రి, దుస్తులతో పాటు డ్వాక్రా రుణం కింద తీసుకున్న రూ.లక్ష 20వేలు, 16 గ్రాముల బంగారం కూడా పూర్తిగా కలిపోయింది. వైఎస్సార్ సీపీ జిల్లా నాయకులు బత్తుల కోటేశ్వరరావు, బత్తుల రాజేంద్రలు నిత్యావసర వస్తువులు, దుస్తులు అందించారు.


దగ్ధమైన పూరిల్లు